# ఎంతెంతదూరం?

సీతారామయ్యగారు ఆరోజు తెలతెలవారుతుండగానే నిద్ర మంచం పైనుంచి దిగేరు. ఆయనకా అలవాటు ఇప్పటిది కాదు. గడచిన యాభై సంవత్సరాలుగా వస్తున్నదే. ఉదయం నాలుగ్గంటలకే లేవటం, కాలకృత్యాలు, స్నానం పూర్తి చేసి, పూజా పునస్కారాలు గూడా పూర్తి చేసుకుని, బయటకొచ్చి నడవాలోని ఫ్రేము కుర్చీలో కూలబడి పేపరు కుఱ్ఱాడి కోసం ఎదురు చూస్తుంటారు. సరిగ్గా ఆరింటికల్లా పేపరొస్తుంది. దాన్లోని ముఖ్యమైన విషయాలన్నిటిని చకచకా సమగ్రంగా చదివేసరికి ఏడు.

అప్పటికిగాని చిన్నకోడలు విశాలక్ష్మి పక్కపై నుంచి లేవదు. ఆ తర్వాత అరగంటకి– పిల్లలు, ఇంకో గంటకి కొడుకు మంచాలు దిగుతారు. నాలుగ్గంటలకే లేచిన సీతారామయ్యగారి చేతికి కాఫీగ్లాసు వచ్చేసరికి ఎనిమిది.

ఇవన్నీ చూస్తుంటే ఆయనకి అసహనంగాను, అసహ్యంగాను, బాధగాను వుంటుంది. అక్కడికీ కొడుక్కి, కోడలికి ఎన్నోసార్లు చాలా సందర్భాలలో చెప్పారు. ఇలా సూర్యుడు పొడిచాక, బారెడు పొద్దు తిరిగాక లేవటం ఆరోగ్యం కాదు, సాంప్రదాయం కాదు అని– కాని వాళ్ళకి అర్థం కాదు. అర్థం చేసుకోవాలన్న ప్రయత్నం గూడా కన్పించదు. పిల్లల చేత 'మమ్మీ డాడీ'ని పిలిపించుకోవటం, టేబిల్‌మీల్సు చెయ్యటం, పాప్ మ్యూజిక్కు వినటం, నైట్‌గౌన్లు వేసుకోవటం, ఆడపిల్లలకి జుట్లు కత్తిరించటం మేము ఆధునికులం సుమా అని రుజువు చేసుకోటానికి వాళ్ళు పడే ఆదుర్దాలో ఇంకోమాట వినిపించదు.

సీతారామయ్యగారిది పదిసార్లు చెప్పగలిగే పరిస్థితి కాదు. వాళ్లది చెప్పించుకునే వయస్సూ కాదు. భార్యని పోగొట్టుకుని, తనదంటూ నెలసరి ఆదాయం లేక, వున్న ఇద్దరి కొడుకుల్లో పెద్దవాడు అమెరికాలో స్థిరపడగా, ఇక రెండోవాడి దగ్గర వుండక ఏం చేస్తారు? అందువల్లనే కిక్కురు మనకుండా కాలం గడుపుకొస్తున్నారు.

నిజానికారోజు ఆయన ప్రతినిత్యం కన్నా ఇంకాస్త ముందుగా లేచారు. లేవటమే కాకుండా కాస్త ఆదుర్దాగా కూడా కనిపిస్తున్నారు. మొహం కడిగి, స్నానం పూర్తి చేసుకుని, టైము చూసేరు– నాలుగున్నర!

ఆయన మెల్లిగా కొడుకు పడకగది వైపుగా వెళ్ళారు. తలుపులు దగ్గరగా వేసున్నాయ్. రెండు క్షణాలు సందేహించి, ఇక తప్పదన్నట్లు–

"అమ్మా విశాలక్ష్మీ– ఒరే రామశేషూ" అంటూ పిలవనారంభించేరు. సరిగ్గా పదినిమిషాలు నామస్మరణ చేసాక గాని, కోడలు బద్ధకంగా 'ఊ' అన్న మూలుగు వినిపించింది కాదు.

"అపుడే అయిదవుతోంది. వాడ్ని లేవమ్మా– స్టేషనుకి వెళ్లద్దూ" అన్నారు అక్కడే నిలబడి.

మరో పదినిమిషాలకి గాని కోడలు తలుపు తీసుకుని ఆవులించుకుంటూ బయటకొచ్చింది కాదు. వేసుకున్న నైట్‌గౌన్‌కి గుండీలు నాభివరకు తెరిచే వున్నాయ్. పచ్చుటివొళ్ళు, వెచ్చుటివయస్సు పడగ్గదిలోనే కాకుండా, బయట ప్రపంచానికి గూడా దర్శనమిస్తున్నాయ్.

సీతారామయ్యగారు కళ్ళు మూసుకున్నారు. తలని తిప్పేసుకున్నారు. ఆమె తలని బరుక్కుంటూ "ఆయన్ని మీరే లేవండి– 'నావల్ల కాదు" అనేసి స్లిప్పర్సుచప్పుడు చేసుకుంటూ బాత్రూం వైపుగా వెళ్ళింది. ఆయన లోనికెళ్ళారు. రామశేషు దిండుని రెండు కాళ్ళమధ్యన బిగించి, మంచానికి తాపడం చేసినట్లు కరుచుకుని పడుకున్నాడు.

"ఒరే శేషూ– లేవరా– అన్నయ్యొస్తున్నాడు – స్టేషన్‌కెళ్ళవా– అపుడే అయిదు దాటిందిరా" అని పావుగంట పాట పాడేకగాని రామశేషు కళ్ళు తెరిచాడు కాదు.

* * *

రామశేషు, భార్యా స్టేషన్‌కెళ్ళారు–

పెద్దకొడుకు కృష్ణప్రసాద్ వస్తున్నాడంటే– అందులో చాలా సంవత్సరాల తర్వాత వస్తున్నాడంటే సీతారామయ్యగార్కి సంతోషంగానే వున్నా, మరొక ప్రక్కన దిగులు, భయం కూడా లేకపోలేదు. దానికి పరోక్షంగా చిన్నకొడుకు రామశేషే కారణం–

రామశేషుకి మంచి ఉద్యోగం వుంది. నెల తిరిగేసరికి నాలుగంకెల రాబడుంది. దాంతోపాటే బోల్డు అలవాట్లున్నాయ్.

వాటిల్లో ముఖ్యమైనది తాగుడు, మొదట్లో బయటెక్కడో తాగొచ్చేవాడు. కాని ఇటీవల ఇంట్లోనే మొదలెట్టాడు. ప్రతిరోజు భోజనానికి ముందు భార్యతో కబుర్లాడుతూ ఇంగ్లీషు సంగీతం వింటూ...

–సీతారామయ్యగారికన్నీ తెల్సు. కాని ఏమీ చెయ్యలేని, ఎవ్వరికీ చెప్పలేని అశకత్త. ఇక్కడున్న వీడే ఇంతగా పాడైపోతే దేశం కాని దేశం వెళ్ళిన వాడెంతగా పాడయ్యాడో, ఏమేమి చూడాలోనన్న దిగులు, బెంగ...

గంట తర్వాత టాక్సీ వచ్చి ఇంటిముందాగింది. ముందుగా రామశేషు, ఆవెనుక విశాలక్ష్మి, పెద్దకోడలు రమ, ముందు సీట్లోంచి కృష్ణప్రసాదు దిగేరు.

సీతారామయ్యగారి కళ్ళు పరీక్షగా కొడుకు కోడల్ని చూసుకున్నాయ్.

రమ గచ్చకాయరంగు పట్టుచీర కట్టుకుంది. జడల్లుకుని ఇంత మల్లెపూలదండని తల్లో పెట్టుకుంది... నుదుటిన పావలా బిళ్ళంత బొట్టు... కృష్ణప్రసాద్ సాదా ప్యాంటు,, బుషర్టు వేసుకుని సింపుల్‌గా వున్నాడు.

తండ్రిని చూడగానే వాళ్ళిద్దరూ రివ్వునొచ్చి ఆయన పాదాల్ని తాకేరు. వాళ్ళిద్దరి శిరస్సుల్ని తాకుతూ, అంతులేని ఆనందాన్ననుభవిస్తూ మూగగా వుండిపోయేరు సీతారామయ్యగారు చాలా సేపు–

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది–

సీతారామయ్యగారు యథావిధిగా నాలుగ్గంటలకే లేచి కూర్చున్నారు. నిన్నటి రోజంతా సందడిగా, సంతోషంగా గడిచిపోయింది. పలకరింపులు, పరామర్శలు, విదేశీవిశేషాలు, స్వదేశి రాజకీయ కబుర్లతో కాలమే తెల్సింది కాదు. విశాలక్ష్మి,

హోటల్లో భోంచేద్దామంది. కాని పెద్దకోడలు రమ 'నథింగ్ డూయింగ్ ఇంట్లోనే తినాలంది. డైనింగ్ బల్లకి సెలవిచ్చి, అందరూ నేలపైనే పంక్తి భోజనాలు కావించారు ఒక్క రామశేషు తప్ప. అతడు ఆకలిగా లేదని చెప్పి గదిలోకెళ్ళితలుపేసుకున్నాడు. కారణమేమిటో స్వదేశీయులకి తెల్సు–

భోజనాలయాక తండ్రి, పెద్దకొడుకు, కోడలు చాలాసేపు చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

కృష్ణశాస్త్రి పాయిట్రీ గురించి, బాలమురళీ సంగీతం గురించి, శ్రీశ్రీ మరణం గురించి, బాపూ కొంటె బొమ్మల గురించి– మాట్లాడుకుని పడుకునే సరికి పొద్దుపోయింది.

అందువల్ల ఆలస్యం అయిపోయిందని చెప్పి సీతా రామయ్యగారు ఆదుర్దాగా లేచి మొహం కడిగి, స్నానం చేసి వస్తూ పెద్దకొడుకు పడుకున్న గదివైపుగా చూసేరు. తలుపులు తీసున్నాయ్. మంచాలు కాళీగా వున్నాయ్– రామశేషుగది తలుపులు భద్రంగా మూసేసి వున్నాయ్.

కృష్ణుడు బయటిగ్గాని వెళ్ళేడాని ఆలోచిస్తూ ఆయన పూజాగదివైపు వెళ్ళబోతుండగా, పెద్దకొడుకు గొంతు కంగుమని వినిపించగా అక్కడే నిలబడి పోయేరు–

"ఉత్తిష్టంతు భూతపిశాచా" ఏతే భూమి భారకాః"

ఆయనక్కడ్నించి కదిలి కాస్త ముందుకెళ్ళి గదిలోనికి తొంగిచూసేరు– కృష్ణుడు ధోవతీ కట్టి, మెళ్ళో రుద్రాక్షలతో నేలపైని చతికిల పడి కూర్చుని దీక్షగా చదువుతున్నాడు.

అంతలో వంటగదిలోంచి పెద్దకోడలొచ్చి కాఫీ కప్పుని అందించింది– ఆమె స్నానంచేసి, వాయిలు చీరె కట్టుకుని పవిత్రంగా ఉంది–

"లేదమ్మా– ఇంకా పూజ కాలేదు– నాకన్నా మా కృష్ణుడే నయం–" అనుకుంటూ తనూ పూజగదిలోకెళ్ళారు– సీతారామయ్యగారు!